# నాణానికి మరోవైపు

-కందుకూరి వెంకట మహాలక్ష్మి

ఉదయం లేచిన దగ్గర నుంచీ నర్మదకి చాలా హుషారుగా వుంది. తను ఆఫీసులో జాయినవుతున్న తొలి రోజు. రాత్రల్లా ఈ ఆనందంతో సరిగ్గా నిద్ర కూడా పట్టలేదు. తెల్లవారగట్లే క్తా కునుకులా పట్టింది. మళ్ళీ ఉలిక్కిపడి లేచింది. టైము చూస్తే అయిదు దాటింది. గబగబా లేచి ముఖం కడుక్కుని, కాఫీ తాగి, దిన కృత్యాలు ముగించుకుని లంచ్ బాక్సు రెడీ చేసుకుని కాస్త టిఫిన్ తిని బయలుదేరేసరికి తొమ్మిది గంటలు దాటుతోంది. గబగబా బయలుదేరి, మొదటి రోజు బస్సయితే లేటవుతుందని ఆటో ఎక్కింది. అరగంటలో ఆఫీసులో వుంది.

ఆఫీసులోకెళ్ళి ముగించవలసిన ఫార్మాలిటీస్ ముగించి, తను చెయ్యవలసిన పనుల గురించి తెలుసుకుంది. మేనేజర్ దగ్గరకు తీసుకెళ్ళి పరిచయం చేస్తానని హెడ్ క్లార్కు వచ్చాడు. నర్మద లేచి మేనేజర్ గదిలోకి వెళ్లింది.

బెల్ మోగగానే 'కమిన్' అన్న గొంతు విని ముందు హెడ్ క్లార్కు వాసుదేవరావూ, వెనక నర్మదా లోపలికి వెళ్లారు.

"నమస్కారం సార్!" అన్న అతనివైపు చూశాడు కె.ఎ.రావు. "ఈమె నర్మదగారు. మన ఆఫీసులో కొత్తగా జాయినయిన మీ పి.ఎ. సార్." అంటూ పరిచయం చేశాడు. వాసుదేవరావు.

"నమస్కారం సార్" అన్న నర్మద తెరిచిన నోరు తెరిచినట్లే వుంచి మేనేజర్ వైపు అలా చూస్తూనే వుండిపోయింది. అదే పరిస్థితి కె.ఎ.రావుకీ కలిగింది.

ప్రతి నమస్కారం చేయకుండానే "ఎస్, ఓకే, యుకెన్ గో నౌ" అంటూ వారిని పంపి ఆలోచనలో పడ్డాడు కె.ఎ.రావు.

నర్మద ఈ వూళ్లోనే వుందా? అందునా నాకు పి.ఎ.గా రావడమా? చాలా ఆశ్చర్యంగా వుంది. నేనీ ఆఫీసులోనే వున్నాననీ, నాకే పి.ఎ.గా చేరుతున్నాననీ నర్మదకి తెలుసా? తెలిసే చేరిందా? పదిహేనేళ్ళ క్రితం నన్నొదిలేసి వెళ్ళిన నర్మదని మళ్లీ ఇదే చూడడం. కాస్త వయసు వల్ల వచ్చిన మార్పు తప్ప మరే మార్పూ లేదు. నన్ను చూసి ఏమనుకుంటోందో? అన్న ఆలోచనలతో ఆనంద్‌కి ఆఫీసు పనిమీద ధ్యాస లగ్నం కావడం లేదు. ఏమిటో మనసు ఆందోళనకి గురై, ప్యూన్‌ని పిల్చి కాఫీ తెమ్మని, అతను తెచ్చిన కాఫీ తాగి, రివాల్వింగ్ కుర్చీలో జారగిలపడి కళ్ళుమూశాడు రావు.

"కే.ఏ.రావంటే ఎవరో అనుకున్నాను. ఆనంద రావని అనుకోలేదు. ఈ వూరెప్పుడు బదిలీ అయి వచ్చాడు? విధి ఎంత చిత్రమయినది? పదిహేనేళ్ళ క్రితం తెగిపోయిన బంధం మళ్ళీ అతని దగ్గరే నన్ను ఉద్యోగం చెయ్యమని చెప్తోందా? ఎలా చెయ్యాలీ ఉద్యోగం!? పోనీ మానేస్తే! మళ్లీ మరో ఉద్యోగం దొరకొద్దూ?"

పంతాలూ, పట్టుదలలతో భర్తనొదిలేసి వచ్చేసింది. "నీ డబ్బు కూడా నాకు అక్కరలేదని కోర్టులో చెప్పి మరీ విడిపోయింది. తల్లి వున్నన్నాళ్లూ అక్కడే వుంది. తల్లి గతించింది. మరదలు కాపరానికి వచ్చాక ఇంట్లో కొన్ని మార్పులు జరిగాయి. ఇంక ఆ ఇంట్లో వుండలేక ఉద్యోగాన్వేషణ ప్రారంభించింది. ఎన్నో ఉద్యోగాలకి అప్లై చెయ్యగా, చెయ్యగా కష్టంమీద ఈ ఉద్యోగం వచ్చింది. నిజానికి తన పి.జి.కి తగిన ఉద్యోగం కాదు. కానీ ఏదో ఒకటని చేరింది.

"మరిప్పుడు ఏం చెయ్యాలి? విడాకులు తీసుకున్న భర్త దగ్గర పనిచెయ్యాలా? వద్దా!" అన్న ఆలోచనతో తల తిగిరి పోసాగింది. నాకు వేరే ఉద్యోగం దొరికేదాకా తప్పదు. దురదృష్టం నన్నిలా వెంటాడుతోందేమిటి?

తల్లి వున్నన్నాళ్ళూ ఎంతో గారంగా చూసుకుంది. ఆ తరువాత తమ్ముడూ, మరదలూ తను వాళ్ళకి అడ్డుగా వున్నట్టు భావించారు. అది చాలా బాధించింది. చిన్నప్పటి నుంచీ నర్మదది చాలా పట్టుదల గల స్వభావం. ఆమె పుట్టింట ఆడింది ఆట, పాడింది పాటగా సాగింది. అత్తింట కూడా అలా సాగాలన్నది ఆమె పట్టుదల. అత్త మామలకి ఆనంద్ ఒక్కడే కొడుకు. అందునా ఆనంద్ నర్మదని కావాలని కోరి మరీ చేసుకున్నాడు. దాంతో నర్మదకి మరీ అహంకారం పెరిగింది. ప్రతీ విషయానికీ తనదే పెత్తనంగా, పైచేయిగా వుండాలని కోరుకునేది. అత్తగారికి నర్మద లక్షణాలు నచ్చేవి కాదు. దాంతో ఆనంద్ మధ్యన నలిగిపోయేవాడు. ఇటు తల్లికి చెప్తే ఆమె "పెళ్లాం వచ్చాకే మారిపోయావురా!" అంటూ సణగడం, అటు నర్మదకి చెప్తే

"అయితే నన్నెందుకు పెళ్లాడారు? మీ అమ్మతోటే వుండలేకపోయారా? అమ్మకూచిలాగ" అంటూ సాదింపులతో తల తిరిగిపోయేది. చిలికి, చిలికి గాలివానై చివరకు తల్లిని ఓల్డేజ్ హోంలో చేర్పించమని చెప్పింది. అది ఆనంద్‌కి నచ్చలేదు. అయితే నేనే వెళ్లిపోతానని ఓ రోజు భర్త క్యాంప్‌కి వెళ్లనిచ్చి, తన సామానుతో సహా పుట్టింటికి వచ్చేసింది. తరువాత ఎవరెంత చెప్పినా వినక లాయరు ద్వారా విడాకుల నోటీసు పంపింది. చివరకు విడాకులు వచ్చాయి. ఆ తరువాత ఆనంద్ గురించి ఆమె తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు.

తండ్రి గతించాడు. తల్లిని ఒప్పించి పి.జి.లో చేరి పూర్తిచేసింది. తరువాత తల్లి కూడా గతించడం, ఇంట్లో మార్పులతో ఉద్యోగాన్వేషణ– కొన్నాళ్ళకి వేరే వూళ్ళో ఈ ఉద్యోగం రావడంతో ఎంతో స్వేచ్ఛగా వుండొచ్చనుకుంది. కానీ జరిగిందేమిటి?

మళ్లీ యిన్నేళ్ళ తరవాత ఆనంద్‌ని కలుసుకుంది. రేపటి నుంచి అతని దగ్గరే పని చెయ్యాలి. ఈ ఉద్యోగం ఎలాచెయ్యడం? అన్న ఆలోచనలతో బుర్రవేడెక్కి పోసాగింది. రాత్రి చాలా సేపటి వరకూ నిద్ర పట్టలేదు.

తెల్లవారింది. తప్పదన్నట్లుగా కార్యక్రమాలు ముగించుకుని ఆఫీసుకి బయలుదేరింది. నిన్నటి ఉత్సాహం లేదు. ఆఫీసుకి చేరిన కాస్సేపటికి మేనేజరు గది నుంచి పిలుపొచ్చింది. పెన్నూ, పేడూ తీసుకుని ఆనందరావు గదిలోకి వెళ్లింది.

గదిలోకి అడుగుపెట్టిన నర్మదని చూస్తూనే "హలో నర్మదా! రా కూర్చో, ఎలాగున్నావు? బాగున్నావా?" అన్న అతని పలకరింపుకి ఉలిక్కిపడి చూసింది. తలొంచుకునే బాగానే వున్నాను. "మీరెలాగున్నారు? మీ అమ్మగారెలా వున్నారు?" అంది యాంత్రికంగా. "అమ్మ బాగానే వుంది. మా ఊర్లోనే వుంది. బాగా పెద్దదయింది కదా! ఇక్కడ నేను ఒక్కడినే వుంటున్నాను" అన్నాడు ఆమె వైపుకి చూస్తూనే. ఆ మాటలు అలా చెప్పడంలో ఏదో తేడా కనపడింది. "అయితే తను విడాకులు ఇచ్చేశాకా మళ్లీ పెళ్లి చేసుకోలేదా?" అన్న సందేహం కలిగింది. కానీ అడిగే ధైర్యం లేక తలొంచుకునే "డిక్టేషన్ ఇస్తారా?" అన్నదానికి "ఏంలేదు, మాట్లాడాలని పిల్చాను. కూర్చో కాఫీ తెప్పిస్తాను" అంటూ ప్యూన్‌ని పిల్చిన ఆనంద్‌ని వారించలేక, ఎదుటి కుర్చీలో కూర్చుంది నర్మద.

సిగ్గు, సంకోచం మనసంతా ఆవరించింది. ఆనంద్ ఏదన్నా మాట్లాడితే బాగుండునని ఎదురు చూస్తోంది. అతను నర్మద వైపు చూస్తూ కూర్చున్నాడు. ఇంతలో వచ్చిన కాఫీని నర్మద కొకటిచ్చి, తనో కప్పు తీసుకున్నాడు. ఏం మాట్లాడాలో తెలీక "ఎక్కడుంటున్నారు?" అంది. అతనుండే ఏరియా చెప్పగానే ఉలిక్కిపడింది. తనుండేదీ అక్కడే! అతనుండే యింటికి కొద్ది దూరంలో ఓ గదీ, వంటిల్లూ తీసుకుని వుంటోంది. "నువ్వెక్కడుంటున్నావు?" అన్న అతని ప్రశ్నకి "మీ వీధిలోనే ముకుందం గారింట్లో" అంది. "ఓ! ఐసీ. అయితే ఉదయం నా కారులో వచ్చేస్తూ వుండు. కలిసి ఆఫీసుకి వచ్చేద్దాం" అన్న మాటలకి ఏమీ జవాబివ్వలేదు.

మర్నాడు ఉదయం తొమ్మిదిన్నరకి ఇంటి ముందు కారాగింది. డ్రైవరు వచ్చి "సార్ రమ్మంటున్నారు" అన్నాడు. అనాలోచితంగా పర్సూ, లంచ్ బాక్సూ తీసుకుని కారెక్కింది. వెనక సీట్లో కూర్చున్న ఆనంద్ ప్రక్కని కూర్చోడానికి ఏమిటో సందేహంగా వుంది.

## చివరి పేజీ

చీకటి దీపం ముందు
నిశ్శబ్ద రాత్రి రహస్యంలా
బతుకు పేజీల రెపరెపలు.
ఒక్కొక్క పుటలోంచి
మంటలు మల్లెల జ్ఞాపకాలు
ఇంతకాలంగా రాస్తున్న కలం
శూన్యం ముట్టడిలో చిక్కుకుంది
స్తబ్దంగా ఒరిగిపోతోంది
రాసుకున్న పేజీల్లోంచి
నెమలీకలన్నీ
ఒక్కసారిగా కళ్ళు విప్పాయి
ఆత్మీయంగా కలాన్ని పెనవేసుకున్నాయి
మా గురించి మర్చిపోయావా అని
రుద్ధ కంఠంతో ప్రశ్నించాయి
కలం ఉలిక్కి పడింది
నెమలీకల బలంతో నిటారుగా నిల్చుంది
మళ్ళీ ధీమాగా నడక ప్రారంభించింది
ఇప్పుడు కలం కళ్ళల్లో
నెమలీకల కళ్ళల్లో పింఛాలు విప్పుకున్నాయి
చివరి పేజీకేసి
కలాన్ని నడిపిస్తూనే ఉన్నాయి.

–డా॥ సి. భవానీదేవి

## శాస్త్రం

ఆరోజు నేనప్పుడే బాల్యంలోకి అడుగుపెట్టిన రోజు
అమ్మా, నాన్నల చేతులు పట్టుకుని విశాల విశ్వం
లోకి అడుగుపెట్టా
పచ్చనిచేలు, పరుగులు పెట్టే కుందేళ్లు
షికార్లు కొట్టే మేఘాలు, ఎగిరే తెల్లని కొంగలు
ఎంత బాగుందో ప్రపంచం! నా మనసంతా ఆనందం
నా కళ్లనిండా సంతోషం. సంతోషం చాటున బోలె
డన్ని కలలు
అయ్యో! అబ్బా! నన్నెవరో జబ్బపట్టుకు లాగేశారు..
బాధగా వెనక్కి చూశా.. గుప్పిట మూసిన చేతుల్తో
మా మాష్టారు.
గుప్పిట్లో బహుమతేమో! వెలుగుతున్న కళ్లతో ఆశగా
చేయి చాచా
చాచిన చేతుల్లో బోలెడన్ని బుడగలు.. అబ్బో బుడగలే
హుషారుగా ఊదబోతుంటే
ఛీ, ఛీ వెధవా నా కడుపున తప్ప పుట్టావురా..
ఇప్పట్నించే ఇవేం బుద్ధులురా
అంటూ అమ్మ ఒక్కటేసింది..
ఒరేయ్ భ్రష్టవెధవా వేలెడు లేవు వెధవ్వేషాలు
మొదలెట్టావా చంపేస్తా
బోస్టన్‌లో పడేస్తా.. బోడివెధవా అంటూ నాన్న తిట్టాడు
ఇదేంటి మాష్టారూ ఆడుకోడానికి బుడగలిచ్చారు..
ఆడుకుంటే అమ్మా, నాన్న ఆడిపోసుకుంటున్నారు
అని అడిగాను అయోమయంగా..
అది ఆడుకునే వస్తువు కాదురా.. శాస్త్ర విజ్ఞానానికి
సింబల్ అన్నారు మాష్టారు..
ఇదేం శాస్త్రం.. బుడగల శాస్త్రం అంటే.. బుడగల
శాస్త్రం కాదురా బుడతడా
అది కామశాస్త్రం.. కండోమ్ శాస్త్రం అంటూ
బోలెడంత విజ్ఞానం కుమ్మరించారు
ఆ విజ్ఞానాన్ని అర్థం చేసుకోలేని అజ్ఞానంతో
అయోమయంగా చూశా
థియరీ అస్సలర్థం కాలేదు.. ప్రాక్టికల్స్ అయితే
బెటరేమో మాష్టారూ!
గూబ గుయ్యిమంది.. భడవా ప్రాక్టికల్స్ కావాలా..
గవర్నమెంటు థియరీ మాత్రమే చెప్పమందిరా
అన్నారు మాష్టారు
అవునా! అదేంటో.. పిల్లలంటే అందరికీ చులకనే
అన్నిట్లోలాగే ఇందులోనూ అసమానతే.

—అత్తలూరి విజయలక్ష్మి

రెండేళ్ళకి పైగా అతనితో కలిసి జీవితం గడిపింది. ఒకరినొకరు బాగా ఎరుగుదురు. అలాంటిది యిప్పుడు అతని ప్రక్కని కూర్చోవాలంటే ఎందుకు మొహమాటం? ఈ పదిహేనేళ్ళ ఎడబాటూ యిద్దరినీ కొత్తవారిని చేసేసిందేమిటి?

అసలు ఆనంద్ తప్పేమిటీ? అతను చేసిన నేర మేమిటీ? చిన్న చిన్న విషయాలని పట్టించుకుని, పట్టు దలతో సంసారాన్ని పాడి చేసుకుంది. అతను తన నెప్పుడూ పల్లెత్తు మాట అనలేదు. తన కోరికల్ని తీర్చ గలిగినన్నీ తీర్చేవాడు. కొన్ని చెయ్యలేనివి వుంటేనూ, పరిస్థితుల్ని బట్టి కొన్ని కాదంటేనూ ఉక్రోషం వచ్చేది. దాంతో పెద్ద గొడవ చేసి సాధించేది. అయినా మాట్లాడే వాడు కాదు.

ఒక విధంగా చెప్పాలంటే అతని ఓర్మినంతా పరీ క్షగా పెట్టింది. ఎప్పుడూ తన తరఫు నుంచే ఆలోచిం చేది. తెగేదాకా తాడు లాగింది. ఒకవైపు నుంచే తాడుని తెంపింది. అమ్మ వున్నన్నాళ్ళూ తన గారాలు సాగాయి. అమ్మ పోయి, తమ్ముడి పెళ్లితో నాణానికి మరోవైపు కనపడింది. ఒంటరిదయింది. వేరే వెళ్ళి వుంటానంటే తమ్ముడు ఏమీ మాట్లాడలేదు. మరదలి దగ్గర తన ఆటలు సాగేవి కావు. వాళ్ళిద్దరి మధ్యా నలగడం ఇష్టంలేని తమ్ముడు వేరే వెళ్తుంటే మాట్లాడలేదు.

వేరే వెళ్ళాకా ఒంటరితనం బాధించసాగింది. తన తప్పులొక్కటొక్కటే గుర్తుకు రాసాగాయి. అప్పుడు భర్త గుర్తుకొచ్చేవాడు. అతని ఓర్మి, శాంతం గుర్తుకొచ్చేవి. కానీ ప్రయోజనం?! అంతా అయిపోయింది. విడాకులు వచ్చేసాయి. ఇప్పుడు వయసు కూడా నలభయ్యో పడిలో పడబోతోంది. ఇప్పుడు తనకి భర్త కాదు– ఓ తోడూ, నీడా కావాలని మనసు కోరుకుంటోంది. అదిప్పు డెలా సాధ్యం?

ఆఫీసు దగ్గర కారు ఆపాడు ఆనందరావు. తన ఆలోచనల్ని కట్టిపెట్టి కారు దిగింది. ఈ కారు తనది కాదు. అతను తనవాడు కాదు. కలిసొచ్చి ఓ చోట దిగారు. అంతే! ఏదో బాధ తన్నుకొస్తోంది.

ఇలా రోజూ అతని కారులో రావడం, అతని దగ్గర పనిచెయ్యడం. అంతేకాదు, ఆనంద్ పెళ్లయిన తరువాత తనతో చనువుగా ఎలా వుండేవాడో అలాగే చనువుగా పలకరించడం, మాట్లాడటం, కాఫీ తెప్పించ డం, యిద్దరూ కలిసి తాగడం లాంటివి చెయ్యడం మామూలయ్యాయి. నర్మదకి అతనిలో ఏవిధమైన మార్పు కనబడకపోవడం చాలా ఆశ్చర్యంగా వుంది.

అలా అని ఎప్పుడూ హద్దుమీరి మాట్లాడలేదు. తన పట్ల ఏ కోపమూ, పగా, ద్వేషమూ లేకుండా పాత ఆనంద్‌లాగే, తన భర్తగా వున్నప్పటిలాగే వున్నాడు. నిజంగా ఎంత శాంతమూర్తి. పెళ్లి తరువాత తనెంత గొడవ చేసినా కూడా యిలాగే వుండేవాడు. యిలాగే మాట్లాడేవాడు. అప్పటికీ, యిప్పటికీ ఏ మార్పూ లేదు. ఒక్కడూ వుంటున్నాడు. అంటే యింకా అతను నన్నే ప్రేమిస్తున్నాడా? ఆనంద్ నా గురించి అడిగినప్పుడు అతనితో దాచుకోకుండా తన గురించి అంతా చెప్పింది. తల్లీ, తమ్ముళ్ళ గురించి చెప్పిన విషయాలు విని చాలా బాధపడ్డాడు. "ఒక్కర్తివీ వుంటున్నావా?" అన్నాడు జాలిపడుతూ.

రాను రాను ఒంటరి బ్రతుకుతో, యాంత్రిక జీవనంతో విసిగిపోయిన నర్మద అనుకుంది. ఆనందరావుతో మాట్లాడి తను "మళ్లీ నీ దగ్గరికి వచ్చేస్తా"నని చెప్దామని. మళ్ళీ బిడియం అడ్డొచ్చేది. అతని నడత, ప్రవర్తన, మాట చూస్తోంటే తను వస్తానంటే వద్దనడని మనసు ధైర్యం చెప్తోంది. కానీ అడగాలంటే నామోషీ! ఒక్కోసారి అతనే తనని వచ్చెయ్యమని అడిగితే ఎంత బాగుండేది అనిపించేది. ఎప్పుడూ ఏదో లోకాభిరామాయణం మాట్లాడేవాడే తప్ప సొంత విషయాలేం మాట్లాడేవాడు కాదు. ఒక్కోసారి నర్మదకి అతని మీద కోపం వచ్చి బాగా తిట్టాలనిపించేది. తనకేం స్వతంత్రం వుంది? విడిపోయి ఎన్నేళ్ళయిపోయింది! "ఇంకా నీకేం హక్కుంది, నా మీద కేకలెయ్యడానికి?" అని అడిగితే ఏం సమాధానం చెప్తుంది?

ఇప్పుడు ఆఫీసులో వున్నా, ఇంటికెళ్ళినా యివే ఆలోచనలు. మనసు నిలవనివ్వడంలేదు. బుర్ర వేడెక్కిపోతోంది. మళ్లీ ఆనంద్ దగ్గరికి వెళ్లిపోవాలి, వాళ్లమ్మని జాగ్రత్తగా చూసుకోవాలి. మరదలు తన్ని సరిగ్గా చూడకపోతే బాధపడింది. అలాగే ఆనంద్ తల్లీ బాధపడి వుంటుంది. ఇంక యిలా ఒంటరి బ్రతుకు బ్రతకడం దుర్భరం. టైము చూసి ఆనంద్‌ని అడిగెయ్యాలి. ఈ విడాకులు కాగితాలమీదే! మనసుల్లో కాదు. మనసులు కలిస్తే! ఈ విడాకులు చింపేస్తే ఏం చేస్తాయి? అనుకుని చివరికి తన మనసులోని మాట ఆనంద్‌కి చెప్పాలని నిశ్చయించుకుంది.

ఎప్పటిలాగే కారులో యింటి దగ్గర దింపిన ఆనంద్‌ని "లోపలికి రండి, కాఫీ తాగి వెళ్దురుగాని" అంది నర్మద సందేహిస్తూనే. "పద" అన్నాడు ఎలాంటి అభ్యంతరం చెప్పకుండానే.

## మా దమన నీతికి సాక్ష్యం..

భూగోళాన్ని చుట్టి వస్తున్నా మా చుట్టూ మేమే గిరిగీసుకుంటున్నాం
స్వార్థం నరనరాల జీర్ణించుకుని జీవిత మూలాల్నే మరచి
కాలం వెంట పరుగులు తీస్తున్న మందభాగ్యులం..
కొంత కాలంగా నిన్ను పలకరించిన జాడలేం.. లేవు...
నిముషాల్నే రూపాయలుగా లెక్కిస్తున్న మాకు
నీ కోసం సమయం వెచ్చించే తీరిక ఎక్కడిది?
ఓ అడ్రసంటూ లేని గాలి మాటలు మనసును తాకటంలేదు
మనిషి మనిషి ఎదురైతే మాటలే మిగలటంలేదు...
హృదయాలను ఎడార్లుగా మార్చుకున్నాక
నిజమో భ్రమో తెల్సుకునే ఓపిక మాకెక్కడిది?
ఒకప్పుడు.. నువ్వు...
ఆనంద విషాదాలకు మౌనసాక్షిగా మా జీవితాల్లో అంతర్భాగమైన దానివి
మా క్షేమ సమాచారాల వారథిగా మమతను తట్టి మనసులు ముడివేసే దానివి.
కొందర్ని స్నేహంగా ఇంకొందర్ని ప్రేమగా
కొందరికి స్ఫూర్తిగా, మరికొందరికి ఆర్తిగా
ఇంటిల్లిపాది చేతులు మారి సందడి చేసేదానివి
కవుల కల్పనలోనూ పొడుపు కథల్లోనూ నిత్య నూతనంగా విరాజిల్లేదానివి
నీ తలపే మనసులను కలిపి వేదన తీర్చేది
నీ రాక ఆలోచన రగిలించి సృజన కల్గించేది
జీవితాన్ని అందంగా చిత్రించినా
సరికొత్త కావ్యంలా ఆవిష్కరించినా నీకే చెల్లింది.
ఇప్పుడు.. నువ్వు... గత వైభవానికి గుర్తువి.
మా రాజుల కాలం నుండి మనసెరిగి
మసలిన నిన్ను మరచిన హీనమతులం
మసకేస్తున్న మజిలీలో నిన్నొదలి
వేగం అంచుల్ని అందుకుని మేం పయనించినా
మా దమన నీతికి సాక్ష్యంలా
చావు కబురు బంధువులందరికీ తెలపాల్సింది నువ్వే కదా!

—మాదిరెడ్డి రత్నమంజరి

లోపలికి వెళ్లి కాఫీ, జంతికలూ తెచ్చి అతని ఎదురుగా బల్లమీద పెట్టింది. తను వచ్చేసరికి అతని చేతిలో ఆల్‌బమ్ వుంది. అది తమ పెళ్లి ఫొటోలది. అది అతను చూడటం నర్మదకి ఎంతో ఆనందంగా వుంది. ఆ ఫొటోలు చూస్తుంటే అతని మనసులో ఎలాంటి ఆలోచనలు వస్తున్నాయో! ఏమనిపిస్తోందో? అనుకుంది.

కాఫీ అందుకున్న ఆనంద్ ఆల్‌బమ్ పక్కనపెట్టి "ఇంకా యిది నీ దగ్గరుందే?" అన్నదానికి ఏమీ జవాబు చెప్పలేక తొట్రుపడింది. ఇదే మంచి అదననుకుని "ఆనంద్‌గారూ! ఓ విషయం మిమ్మల్ని అడగాలనుకుంటున్నాను" అన్న నర్మదని చూస్తూ– "అడుగు నర్మదా! సందేహం దేనికీ? మనం కలిసి ఓ ఆఫీసులో పని చేస్తున్నాం– అప్పుడే ఆరు నెలలు అవుతోంది. ఎందుకు సందేహం?" అన్న మాటల్ని ఆసరాగా తీసుకుని లేచి అతని ప్రక్కన సోఫాలో కూర్చుంటూ "ఇంక ఈ ఒంటరి బ్రతుకు బ్రతకలేకుండా వున్నాను ఆనంద్! నీ దగ్గరికి వచ్చెయ్యాలని వుంది. అమ్మగార్ని జాగ్రత్తగా చూసుకుంటాను. నా పొరపాట్లని నేను తెలుసుకున్నాను. నన్ను క్షమించండి. ఆనంద్ క్షమించండి" అంటూ అతని ఒడిలో తలపెట్టుకుని విలపించసాగింది. నర్మద భుజం చుట్టూ చెయ్యి వేసి, లేవదీసి కూర్చోపెట్టిన ఆనంద్ ఏమీ మాట్లాడకుండానే మౌనంగా లేచి వెళ్లిపోయాడు.

వెళ్లిపోతున్న ఆనంద్‌ని చూస్తూ దుఃఖం ఆపులేకపోయింది. అలా ఎంతసేపు దుఃఖించిందో తెలీలేదు. "అతని మౌనం ఏం చెప్పింది? ఏమనుకోవాలి? తను అడిగిన దానికి ఏమీ జవాబు చెప్పకుండా వెళ్లిపోవడంలో అర్థం ఏమిటి?" అన్న ఆలోచనలతో బుర్ర తిరిగి పోసాగింది.

మనసు బాగుండని నర్మద ఆఫీసుకి వెళ్లబుద్దెయ్యక వారం రోజులు సెలవు పెట్టింది. పిచ్చిదానిలా ఇంట్లోనే కూర్చుంది.

ఆఫీసుకెళ్లిన నర్మదకి ఆనంద్ సెలవు మీద వూరెళ్లాడన్న కబురు ఎందుకో చాలా బాధించింది. రోజులు గడుస్తున్నాయి. ఆఫీసుకి వెళ్తోంది, వస్తోంది. మనసంతా అల్లకల్లోలంగా వుంది. ఇంటికొస్తే ఆనంద్ గురించే ఆలోచన. అతని మనసులో తనంటే ఎలాంటి భావం వుంది? ఎందుకలా మాట్లాడకుండా వెళ్లిపోయాడు? ఇష్టం లేకపోతే చెప్పెయ్యొచ్చుకదా! ఇలా సస్పెన్సులో పెట్టి నన్ను బాధింకచపోతే! ఆ సంఘటన తరువాత బాధకొద్దీ సెలవుపెట్టాను. కనీసం ఓసారి వచ్చి కారణం అడగొచ్చు కదా! ఈ ఒంటరి బ్రతుకు ఆనంద్‌ని విసిగించడంలేదా? లేక హాయిగా వుందా? మళ్ళీ ఈ చికాకులెందుకనుకున్నాడా? ఇంత అకస్మాత్తుగా వెళ్లిపోవడానికి ఆ సంఘటనే కారణమా?" అన్న ఆలోచనలు రాత్రింపగళ్ళూ వేధించసాగాయి.

ఆఫీసు నుంచి ఇంటికొచ్చిన నర్మదకి పోస్టు బాక్సులో కవరు కనపడింది. కవరు తీసి ఫ్రం అడ్రసు చూసింది. అది ఆనంద్ రాసిన కవరు. తలుపు తాళం తీసి పర్సు పక్కకి పడేసి "ఏం రాసాడూ?' అనుకుంటూ ఆత్రంగా ఉత్తరం చింపింది.

"చి॥ నర్మదకి– ఆశీర్వచనాలు. నేను మాట మాత్రంగానైనా నీతో చెప్పకుండా సెలవుపెట్టి వచ్చేశాను. నువ్వు ఏమనుకుంటున్నావో?

నేను రాబోయే ముందు నువ్వు ఆఫీసుకి రావడం మానేశావు. కారణం ఊహించగలను. ఆ రోజు నువ్వు అడిగిన దానికి నేను సమాధానం చెప్పకపోవడం నీకు చాలా బాధ కలిగించి వుంటుంది. మొదటి నుంచీ నాది మెతక స్వభావం. ఎవరినీ నొప్పించి మాట్లాడలేను. అదే ఆ రోజు నీకు జవాబివ్వలేకపోవడానికి కారణం. అప్పటినుంచీ యింటికెళ్లిన నాకు నీ గురించే ఆలోచన.

నాకు ఆ వూరికి నువ్వు ఆఫీసులో జాయినవడానికి నెల్లాళ్ల ముందే బదిలీ అయింది.

నీకు ఒక విషయం తెలియజెయ్యవలసి వస్తుందని ఊహించలేదు. సందర్భం రాక చెప్పలేదు. మళ్లీ మనం యిలా కలుస్తామని అసలే ఊహించలేదు. విధి విచిత్రమైనది.

నర్మదా! మనం విడిపోయాక కూడా రెండేళ్ళపాటు నువ్వు తిరిగి వస్తావన్న ఆశతో ఎదురు చూశాను. నువ్వు రాకపోవడంతో చందనని పెళ్లి చేసుకున్నాను.

నాకు బదిలీ అయ్యాకే అమ్మ సొంతిల్లు వదిలి రానని పట్టుబట్టింది. దాంతో అమ్మని అక్కడే వదిలేశాను. చందన ఉద్యోగం మానేసి అమ్మని చూసుకుంటోంది. నాకు ఓ అమ్మాయి. పేరు నర్మద– త్వరలో నేను మా వూరికి బదిలీ చేయించుకుని నిన్ను రోజూ బాధించకుండా వుండే ప్రయత్నంలో వున్నాను. నన్ను మన్నించు నర్మదా!

ఆప్యాయతతో– ఆనంద్"

ఉత్తరం చదివి గాలి తీసిన బుడగలా సోఫాలో కూలబడిన నర్మద, "నాలా కఠినంగా కాకుండా, ఎంత సున్నితంగా చెంపలు వాయించాడు ఆనంద్" అనుకుంది. ■